మెదక్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌దే గెలుపు

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని నర్సాపూర్ సునీతాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆమె మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. మెదక్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో కేటీఆర్, హరీశ్‌రావు ప్రసంగాలు కార్యకర్తల్లో ఉత్సాహం నింపాయని తెలిపారు. అభ్యర్థి ఎవరైనా మెదక్ లోక్‌సభ స్థానాన్ని నాలుగోసారి కైవసం చేసుకుంటామని అన్నారు.

స్వచ్ఛతలో వెనుకంజ

● తిరోగమనంలో మెదక్ మున్సిపాలిటీ
● సగానికి పడిపోయిన స్థానం
● డంపింగ్‌యార్డు నిర్వహణలో నిర్లక్ష్యమే కారణం!

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 19: స్వచ్ఛసర్వేక్షన్-2023 సర్వేలో జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపాలిటీ వెనుకంజలో పడింది. కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఈ సర్వే నిర్వహిస్తుంటారు. నగరాలు, పట్టణాల్లో సర్వే నిర్వహించి 8 విభాగాలకు ర్యాంకులు ప్రకటిస్తోంది.

గతంతో పోలిస్తే సగానికి..

గత సంవత్సరం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో మెదక్ మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిలో 13వ స్థానం వచ్చింది. ఈ ఏడాది 71వ స్థానానికి దిగజారింది. దక్షిణజోన్ పరిధిలో గత సంవత్సరం 16వ స్థానంలో నిలువగా.. ఈసారి 33వ స్థానానికి పడిపోయింది. సర్వే నిర్వహించిన ఎనిమిది విభాగాల్లో సత్తాచాట లేకపోవడమే కారణంగా చెప్పవచ్చు. డంపింగ్‌యార్డు, డీఆర్సీ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతోనే ర్యాంకింగ్ సాధించలేకపోయినట్టు తెలుస్తున్నది. మిగతా ఆరు విభాగాలు దాదాపుగా లక్ష్యాలను చేరుకున్నప్పటికి రెండు అంశాల్లో పరిస్థితి దిగజారడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు ఒప్పుకుంటున్నారు.

ఆరు విభాగాల్లో మంచి మార్కులే..

మెదక్ మున్సిపల్ పరిధిలో 32 వార్డులు ఉండగా పదివేలకు పైగా నివాస, వాణిజ్య భవనాలు ఉన్నాయి. 25వేల నుంచి 50వేల జనాభా ఉన్న మున్సిపాలిటీలతో మెదక్ మున్సిపాలిటీ పోటీలో నిలబడింది. ఇందులో పరిశుద్ధమైన చెరువులు, కుంటల విభాగంలో 100 శాతం, పబ్లిక్ టాయిలెట్స్‌లో 100 శాతం, నివాస ప్రాంతాల్లో పరిశుభ్రతకు 97 శాతం, మార్కెట్ ప్రాంతాల్లో పరిశుభ్రతకు 97 శాతం, ఇళ్ల నుంచి డోర్ టు డోర్ చెత్త సేకరణకు 96 శాతం, సెగ్రిగేషన్‌కు 87 శాతం, డీఆర్సీ సెంటర్ నిర్వహణ, పొడిచెత్తను సేకరించడంలో 16 శాతం, డంపింగ్‌యార్డు నిర్వహణలో సున్నా శాతం మార్కులను పొందింది. ఎనిమిది విభాగాలకు సుమారు 8వేల మార్కులుండగా 4,234 మార్కులను సాధించింది. దీంతో రాష్ట్రస్థాయిలో 71 స్థానం, దక్షిణ జోన్‌లో 33 స్థానాన్ని దక్కించుకుంది.

సర్వే అనంతరం ప్రారంభమైన బయోమైనింగ్

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మార్కులు సాధించకపోవడానికి కారణమైన డంపింగ్‌యార్డును ప్రస్తుతం పూర్తిగా జల్లెడ పడుతున్నారు. బయోమైనింగ్ ద్వారా చెత్తాచెదారాలను వేరుచేస్తున్నారు. కానీ సర్వే సమయంలో బయోమైనింగ్ ప్రారంభం కాకపోవడంతో ఆ విభాగంలో సున్నా మార్కులు వచ్చాయి. డీఆర్సీ సెంటర్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అక్కడ కూడా కేవలం 16 మార్కులే వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



డంపింగ్‌యార్డుకు వెళ్లే రహదారి పక్కన పారవేసిన చెత్త (ఫైల్)



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రభుత్వ భూములు, నీటి వనరులను పరిరక్షించండి

● అక్రమ మైనింగ్, బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు
● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డిటౌన్/సంగారెడ్డిరూరల్, జనవరి 19: ప్రభుత్వ భూములు, నీటి వనరులు ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పలుచోట్ల ప్రభుత్వ భూములు, నీటివనరులు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని లేఅవుట్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగకుండా నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ మైనింగ్‌పై నమోదు చేసిన కేసులు, సీజ్ చేసిన వాహనాలను సీజ్ చేశారో పదిహేను రోజుల్లో నివేదిక అందజేయాలని మైనింగ్ ఏడీకి సూచించారు. జిల్లాలో ఎక్కడా బెల్ట్‌షాప్‌లు ఉండకుండా మూసివేయించాలని ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన వసతులకు సంబంధించి నివేదిక అందజేయాలని సూచించారు. పాఠశాలలు, కాలేజీల్లో వసతులు, సిబ్బంది, భవనాలు తదితర వివరాలను విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సీఎస్ఆర్ నిధులు సేకరించండి

జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు సేకరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వినియోగించేలా చూడాలని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధులు విద్య, వైద్య సదుపాయాల కోసం ఖర్చు చేయాలని, హాస్టళ్లు, ఆసుపత్రులు, అదనపు తరగతి గదులు, విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో కావాల్సిన సౌకర్యాల కోసం వినియోగించేలా చూడాలని సూచించారు. జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద ఇవ్వాల్సిన నిధులు, బకాయిలపై దృష్టిసారించాలని ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులు స్థానికంగానే వినియోగించేలా క్లస్టర్ ఇన్‌చార్జి అధికారులు చైతన్యపరచాలని సూచించారు. సమీక్ష సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి, జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూశాఖ డైరీని ఆవిష్కరించిన మంత్రి

రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని మంత్రి దామోదర్ రాజనర్సింహ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో నగేష్‌గౌడ్, రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మా రాములు, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, గంగాధర్‌రావు, కోశాధికారి ధశరధ్, ఉపాధ్యక్షులు రాధాబాయి, సపరమేశం, కార్తీక్ కుమార్, కలెక్టరేట్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దినేష్ రెడ్డి, వరప్రసాద్, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ కార్యదర్శులు వజయ్‌కుమార్, రాజుపాటిల్, నాగరాజు, నాయకయులు ప్రదీప్, మహాదేవ్, నాగేశ్వరరావు, స్వరూప, జ్యోత్స్న, రూపా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహను జర్నలిస్టులు కలిసి తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా గత ప్రభుత్వం స్థానికేతరులైన కొందరికి మాత్రమే ఇంటి స్థలాలు ఇచ్చిందని, అర్హులకు అన్యాయం చేసిందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మంత్రి జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

సర్కారు బడుల్లో 29న ఎస్ఎంసీ ఎన్నికలు

● నాలుగేళ్ల తర్వాత నిర్వహణ ● షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సంగారెడ్డి అర్బన్, జనవరి 19: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఎస్ఎంసీ కమిటీలకు చివరిగా 2019లో ఎస్ఎంసీలు ఎన్నికలు నిర్వహించారు. ఈ తర్వాత కొవిడ్ ప్రభావంతో కమిటీల పదవీకాలాన్ని ఆరు నెలలకోసారి పొడిగించుకుంటూ వస్తున్నారు. విద్యా శాఖ విడుదల చేసిన ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నేడు నోటిఫికేషన్ జారీ చేస్తారు. విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారు. 22న తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 24న తల్లిదండ్రుల తుది జాబితా విడుదల చేస్తారు. 29న ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం 1.30 గంటలకు సభ్యులతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు తొలి విద్యా కమిటీ సమావేశం నిర్వహిస్తారు. కమిటీ పదవి కాలం రెండేళ్లు ఉంటుంది.

ఈ ఎన్నికల్లో 1-8 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకుంటారు. ఎస్ఎంసీ కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్, మెంబర్ కన్వీనర్(హెచ్ఎం), ఎక్స్ అఫిషియో మెంబర్లుగా అదనపు టీచర్, కౌన్సిలర్ లేదా వార్డు మెంబర్, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎం, మహిళా సమాఖ్య సభ్యులుంటారు. కో ఆప్షన్ మెంబర్లుగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉంటారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. ఓటర్లలో తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుల్లో ఒకరే ఓటుకు అర్హులు. సభ్యులు చేతులెత్తే పద్ధతిలో కమిటీని ఎన్నుకుంటారు.

విద్యాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేస్తున్నది. విద్యాభిమానులు, తల్లిదండ్రుల సహకారంతో విద్యాశాఖ లక్ష్యాలను ఉపాధ్యాయులు సులభంగా సాధించేందుకు ఈ కమిటీలు సహకరిస్తాయి. ఎస్ఎంసీ కమిటీలు మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీని పర్యవేక్షిస్తారు. అంతే కాకుండా మన ఊరు-మన బడి పనులు పరిశీలిస్తారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి

● నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ● రాష్ట్ర ఎన్నికల ముఖ్యఅధికారి వికాస్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 19: అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లతో శుక్రవారం ఆయన వీడియా కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అర్హులైనవారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ బీఎల్‌వో కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 25 జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా, మండల పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నూతన ఓటరుగా నమోదు చేసుకున్నవారికి గుర్తింపుకార్డులు అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు, బీఎల్‌వోలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

పుట్టిన పసికందులందరికీ ఆరోగ్య పరీక్షలు

● రాష్ట్ర స్థాయి వైద్యాధికారులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 19: పుట్టుకతో పిల్లలు అనారోగ్య సమస్యలతో బాధపడకుండా చూడడానికి త్వరలో నవజాత శిశువులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు. సంగారెడ్డిలో శుక్రవారం జిల్లాస్థాయి అధికారులు పర్యటించారు. డీఎంహెచ్‌వో గాయత్రీదేవీతో సమావేశమయ్యారు. జిల్లావ్యాప్తంగా ఎన్ని ప్రభుత్వ ఆస్పత్రులున్నాయి, ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, ఎంత మంది చిన్నారులు జన్మిస్తున్నారు, పుట్టుకతో ఎక్కువగా ఎలాంటి అనారోగ్య సమస్యతో జన్మిస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. పుట్టిన పసికందుల్లో అనారోగ్య సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించారు. దీనిపై త్వరలోనే ముష్కుందు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు నిర్వహించి పుట్టిన పిల్లల్లో రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు చేస్తామని తెలిపారు. దీనిపై డీసీహెచ్ఎస్ సంగారెడ్డి, డీఐవో శశాంక్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు





పాత పంటల జాతరలో బండ్ల ఊరేగింపు, హాజరైన గ్రామస్తులు

చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యం

● పాతపంటల జాతర కోఆర్డినేటర్ విజయ్‌కుమార్

జహీరాబాద్, జనవరి 19: చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా ఉంటామని పాత పంటల జాతర కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల పరిధిలో డీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం 24వ పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతరించి పోతున్న పాత పంటలను వినియోగించేలా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. చిరుధాన్యాలను సాగుచేయాలని కోరుతూ డీడీఎస్ ఆధ్వర్యంలో 35 ఏళ్లుగా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో చిరుధాన్యాల పంటలు ఉన్నాయంటే అది డీడీఎస్ కృషియేనన్నారు. డీడీఎస్ మహిళా రైతులు ప్రస్తుతం 100కు పైగా ఎకరాలకు విత్తనాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన చిరుధాన్యాలకు మార్కెట్లో డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ప్రతీ రైతు తనకున్న పొలంలో కొంతభాగంలోనైనా ఆరోగ్యాన్నిచ్చే చిరుధాన్యాల పంటలను సాగుచేయాలని సూచించారు. రైతులకు విత్తనాలు అవసరమైతే డీడీఎస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం పలువురు డీడీఎస్ మహిళా రైతులు మాట్లాడుతూ డీడీఎస్ పరిధిలోని ఆయా గ్రామాల్లో గ్రామానికి 15 నుంచి 50 ఎకరాల వరకు చిరుధాన్యాలను మహిళా రైతులు సాగుచేస్తున్నట్లు వివరించారు. తాము పండించిన పంటలో కొంత నిల్వఉంచుకుని మిగతాది మార్కెట్‌కు తరలిస్తేనే మార్కెట్లో చిరుధాన్యాల కొరత ఉండదని, లేకపోతే విత్తనాల కొరత ఎర్పడుతుందని గుర్తుచేశారు. గ్రామాల్లో చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండల ఊరేగింపు గ్రామాల్లో తిరుగుతుంటే పాతతరం రోజులు, పంటలు గుర్తుకొస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు నాగుచౌహాన్, ప్రేమ్‌సింగ్, డీడీఎస్ సంస్థ ఉద్యోగులు విజయలక్ష్మి, మంజుల, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

ఓటరు నమోదుపై అవగాహన కల్పించండి

● సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 19 : యువత ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి అధికారులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల నేడు, రేపు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వాములయను చేయాలని సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులతో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఓటరు ముసాయిదా జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులు చేపట్టాల్సి వస్తే సరిచేసుకునేలా చూడాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో నగేష్‌గౌడ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

● ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
● తల్లిదండ్రుల సమావేశంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 19: పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఉపాధ్యాయులకు సూచించారు. మెదక్ మండల పరిధిలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరో రెండు నెలల్లో వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికబద్ధంగా సిద్ధం కావాలని ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై దృష్టిపెట్టాలని, చదువు తప్ప ఇతర పనులు విద్యార్థులకు చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి శ్రీనివాస్‌చౌదరి, ఎంఈవో నీలకంఠం, హెచ్ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్, డీఐఈవో సత్యనారాయణతో కలిసి సందర్శించారు. కష్టపడి చదివి అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

మాతాశిశు మరణాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. మాతాశిశు మరణాలపై శుక్రవారం తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. హైరిస్క్ కేసుల కాన్పుల పట్ల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. వైద్యాధికారులు కేసులను జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసినప్పుడు డాక్టర్‌కు ఫోన్ లేదా మేసేజ్ రూపంలో రోగి వివరాలను తెలపాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చందునాయక్, డీసీహెచ్ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలికి శుభాకాంక్షలు తెలిపిన పులిమామిడి రాజు

సదాశివపేట, జనవరి 19 : సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలుగా నియమితులైన గోదావరి అంజిరెడ్డిని సంగారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పులిమామిడి రాజు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్ రావు, రాములు, పవన్, మందుల నాగరాజు, వాసు, ఆదిత్య, ప్రవీణ్, గిరిధర్, సుధాకర్, హరీష్‌కుమార్, రాగం అనిల్‌కుమార్, గుణాకర్, చిన్న, తాల్లెల్క రాము తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఅంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పులిమామిడి రాజు

గోదావరి అంజిరెడ్డి నియామకం హర్షణీయం

గుమ్మడిదల, జనవరి 19 : సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా గోదావరిఅంజిరెడ్డిని నియమించడం హర్షణీయమని మండల అధ్యక్షుడు చింతల యాదగిరి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, తెలిపారు. గోదావరి అంజిరెడ్డి నేతృత్వంలో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.

రెండోసారి గడ్డం శ్రీనివాస్ నియామకం పట్ల హర్షం

పెద్దశంకరంపేట, జనవరి 19: మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రెండోసారి గడ్డం శ్రీనివాస్‌ను నియమించడంపట్ల మండల అధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అయోధ్యకు విశిష్ట అతిథిగా డాక్టర్ అరవింద్‌కు ఆహ్వానం

● 22న ప్రాణ ప్రతిష్ఠకు హాజరుకావాలని ట్రస్ట్ నుంచి పత్రిక



డాక్టర్ అరవింద్

సిద్దిపేట టౌన్, జనవరి 19 : ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి విశిష్టఅతిథిగా హాజరుకావాలని సిద్దిపేటకు చెందిన తెలంగాణ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ అరవింద్‌కు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ మేరకు ఈనెల 20న సాయంత్రం, 21న మధ్య రావాలని, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత, ఆహ్వానితులకు శ్రీరాముని విగ్రహ దర్శనానికి అవకాశం ఉంటుందని ఆహ్వాన లేఖలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ ఇంత మంచి అవకాశం ఇచ్చినందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణ నుంచి అయోధ్యకు చాలా తక్కువ మందికి అవకాశం వచ్చిందని, తనకు విశిష్ట అతిథిగా ఆహ్వానం అందడం పట్ల ఆనందంగా ఉందన్నారు. అయోధ్యలో సిద్దిపేట ప్రజలు ఆనందంగా, సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తానని చెప్పారు. సిద్దిపేట నుంచి ఎంపికైనందుకు ఆనందంగా ఉందని, జాతీయ స్థాయిలో సిద్దిపేట గుర్తింపు తెచ్చుకోవడంతోనే అవకాశం వచ్చినట్లు భావిస్తున్నానని చెప్పారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. జాతీయస్థాయిలో ఏ కార్యక్రమం నిర్వహించిన సిద్దిపేటకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. దేశంలోనే సిద్దిపేటను అభివృద్ధిలో మంచి పేరు తీసుకువచ్చామన్నారు. అయోధ్య కార్యక్రమంలో సిద్దిపేట పేరు ఇనుమడింపచేసేలా సిద్దిపేట ప్రత్యేకతను చాటాలని సూచించారు.

ప్రజలు బుద్ధి చెప్పినా బీఆర్‌ఎస్ నాయకులకు

అహంకారం పోలేదు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళిధర్‌యాదవ్

నర్సాపూర్, జనవరి 19: ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పినా ఆ పార్టీ ముఖ్య నాయకులకు అహంకారం పోలేదని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్‌యాదవ్ పేర్కొన్నారు. నర్సాపూర్‌లో శుక్రవారం ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, రాష్ట్ర నాయకులు పెద్దరమేష్‌గౌడ్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు బీజేపీ, కాంగ్రెస్ రెండు ఒక్కటై కేసీఆర్‌ను ఓడించాలని కుట్రపన్నారని మాట్లాడటం విడ్డురంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయస్థాయిలో బద్ధ శత్రువులని అటువంటి పార్టీలు ఒక్కటవుతాయంటే ప్రజలు నవ్వుకుంటారన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలే ఓడించాలనుకున్నారని, ఆ నాయకుల అహంకారం, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్లనే ఓటమి చెందారని స్పష్టం చేశారు. అయినా ఇంకా హరీశ్‌రావు, కేటీఆర్‌కు అహంకారం పోలేదన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధిచెబుతారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని తెలిపారు. 22వ తేదీన అయోధ్యలో రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నర్సాపూర్‌లో శివాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నందున ప్రజలు పెద్దసంఖ్యలో రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురేష్, రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, యాదగిరి, లతరమేష్‌యాదవ్ నాయకులు కొత్త శ్రీనివాస్, రాంరెడ్డి, బాలరాజు, ఆంజనేయులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తారా కళాశాలలో

‘జీవశాస్త్రంలో నవీన సరళి’పై జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకురాలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 19 : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో పరిశోధన జీవశాస్త్రంలో నవీన సరళులు అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సును ప్రారంభించారు. మొదటి రోజైన శుక్రవారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశం మాట్లాడుతూ పరిశోధన రంగంలోని నూతన ఒరవడులను, పరిజ్ఞానం పెంచుకోవడానికి విద్యార్థులకు, అధ్యాపకులకు జాతీయ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఐఐటీహెచ్, హెచ్‌సీయూ, గీతం ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ఆచార్యులు అతిథులుగా విచ్చేసి జీవశాస్త్రంలో వారు పరిశోధించే అంశాల గురించి వివరిస్తారని జువాలజీ విభాగాధిపతి రమేశ్‌బాబు తెలిపారు. కాగా ఐఐటీహెచ్ జీవసాంకేతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజకుమార్ ఈరప్ప కీనోట్ అడ్రస్‌లో భాగంగా ఇమ్యూనోథెరపీ గురించి వివరించారు. అదేవిధంగా ఐవీఎఫ్‌లో జరిగే అధునాతన ఔషధాల గురించి సూచనలు చేశారు. అనంతరం ఐఐటీహెచ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్ర ఎస్‌ఏఆర్‌ఎస్-సీఓవీ2 వైరస్ అంశంపై వివరించారు. కాగా ఈ జాతీయ సదస్సుకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తల్లిదండ్రుల పేరిట, వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ సహకారం అందించినందుకు సంస్థ చైర్మన్ అనంతకృష్ణకు కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ సదస్సు సంచాలకులు డా.మిథున్‌కుమార్‌రాథోడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుగుణావతి, నాగరాణి, అన్నపూర్ణ, శ్రావణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో డీసీఎం బోల్తా

● హమాలీ కార్మికుడు మృతి



శివకుమార్ మృతదేహం

హత్నూర, జనవరి 19: అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే డీసీఎం బోల్తా పడి హమాలీ కార్మికుడు మృతిచెందిన సంఘటన హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్ కథనం ప్రకారం.. హత్నూర మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే డీసీఎం వ్యాన్ డ్రైవర్ మధుసూదన్‌రెడ్డి మద్యం మత్తులో వాహనాన్ని నడిపాడు. నాగారం గ్రామ శివారులోని టర్నింగ్ వద్ద డీసీఎం బోల్తా పడింది. డీసీఎంలో బియ్యం దించడానికి వచ్చిన కూలీగా పని చేసే సంగారెడ్డి పట్టణానికి చెందిన నారాయణరెడ్డి కాలనీవాసి ఎర్రోళ్ల శివకుమార్(38) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మధుసూదన్‌రెడ్డితో పాటు మరో కూలీ వసీంకు గాయాలయ్యాయి. వారిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివకుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్ మధుసూదన్‌రెడ్డి మద్యం మత్తులో డీసీఎం నడపడం వల్లే ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ, ఇద్దరికి గాయాలు

రామాయంపేట, జనవరి 19 : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. వివరాల్లోకెళితే.. రామాయంపేట పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఇద్దరు బైక్‌లపై వెళ్తూ బలంగా ఢీకొన్నారు. ఈ మేరకు బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుంటున్న వ్యక్తి అరెస్ట్

● ముంబై ఎయిర్‌పోర్టులో పట్టుకున్న పోలీసులు

హుస్నాబాద్, జనవరి 19 : ఏడేళ్లుగా కోర్టుకు హాజరుకాకుండా తప్పించుక తిరుగుతున్న కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మహంకాళి అమరేందర్‌ను ముంబై ఎయిర్‌పోర్టులో శుక్రవారం అరెస్ట్ చేసినట్లు హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. 2014 సంవత్సరంలో కోహెడ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో అమరేందర్ కోర్టుకి హాజరు కాకుండా తప్పించుక తిరుగుతున్నాడని, నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ ఇష్యూ అయ్యిందని పేర్కొన్నారు. అమరేందర్ బ్రహ్రైన్ దేశం నుంచి రాగా ముంబై ఎయిర్‌పోర్టులో కోహెడ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసు పురోగతిలో పాలుపంచుకున్న కోహెడ ఎస్‌ఐ తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ లింగారెడ్డి, కానిస్టేబుల్ రాజును ఏసీపీ సతీష్ అభినందించారన్నారు.

‘నెట్’ అర్హత పరీక్షలో యువకుడి ప్రతిభ

రాయపోల్, జనవరి 19 : ప్రతీ ఏడాది జాతీయస్థాయిలో యూజీసీ - ఎంటీఏ నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్(నెట్)లో దౌల్తాబాద్ మండల యువకుడు చెన్న రాజు అర్హత సాధించాడు. కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ తెలుగు అభ్యసించిన మండలంలోని శౌరీపూర్ గ్రామానికి చెందిన చెన్న రాజు ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. దేశంలో వివిధ యూనివర్సిటీలకు చెందిన పీజీ స్థాయి విద్యార్థులు పోటీపడే ఈ పరీక్షలో అర్హత సాధించడం ద్వారా పీహెచ్‌డీ అడ్మిషన్ పొందడంతో పాటు డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి అర్హులవుతారు. కాగా మండలానికి చెందిన యువకుడు జాతీయస్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం పట్ల మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మహాజాతర


రేపే కొమురవెల్లి మల్లన్న పట్నంవారం

● మూడునెలల జాతరకు అంకురార్పణ
● హైదరాబాద్ నుంచి వేల మంది భక్తుల రాక
● మల్లన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం


చేర్యాల, జనవరి 19 : కొమురవెల్లి మల్లన్న ఆలయం పట్నంవారానికి సిద్ధమైంది. ఏడో తేదీన నిర్వహించిన స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా ఆదివారం నిర్వహించనున్న పట్నంవారంతో మూడునెలల జాతరకు అంకురార్పణ పడనున్నది. ప్రతీ ఆదివారం 12 వారాల పాటు జానపదుల జాతర సాగనుంది. శివసత్తుల సిగాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల దరువుతో విజయాచల గుట్టలు మార్మోగనున్నాయి.

పట్నంవారం ప్రాముఖ్యం

సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తుండటం అనాదిగా వస్తోంది. మల్లన్న యాదవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవీని వివాహమాడిన నేపథ్యంలో యాదవులకు ఈవారం అత్యంత ప్రీతికరం. హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తులు శనివారం ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుంటారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోకుండానే స్వామివారిని నేరుగా ధూళి దర్శనం చేసుకుంటారు. ఆదివారం తెల్లవారుజామునే తలనీలాలు అందించి పుణ్యస్నానమాచరిస్తారు. స్థానికంగా కూరగాయలు, మట్టికుండలు కొనుగోలు చేసి భక్తిప్రపత్తులతో బోనం తయారుచేస్తారు. సంప్రదాయబద్ధంగా మల్లన్నకు బెల్లంపాయసంతో బోనం నివేదిస్తారు. పట్నం వేసి సహపంక్తి భోజనం చేస్తారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యాలు సమర్పిస్తారు. అలాగే స్వామివారి తోబుట్టువు ఎల్లమ్మ దేవతకు బోనాలు చేసి నివేదిస్తారు. మరుసటి సోమవారం రోజున హైదరాబాద్‌కు చెందిన యాదవపూజారుల సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలను దాటుతారు. మల్లన్నను ఇతరుల రూపంలో భావించి వంటినిండా పసుపు ధరించి స్వామివారి ఆవాహనంతో అగ్నిగుండాల్లో చిందేసి తన్మయత్వం చెందుతారు. తరువాత వచ్చే ఆదివారాన్ని లష్కర్‌వారంగా పిలుస్తారు.



మల్లన్న ఆలయ రాజగోపురం



క్యూలైన్ కోసం చలువ పందిళ్లు

ఈసారి 12 వారాల జాతర

గతంలో మల్లన్న ఆలయంలో కేవలం మూడు నెలల కాలంలో ఏడు వారాల్లోనే జాతర కొనసాగేది. దీంతో సత్తేటి వారాల జాతర అని పిలిచేవారు. అప్పట్లో భక్తుల రద్దీ అంత ఎక్కువగా లేకపోవడంతో మూడునెలలు మాత్రమే ఆలయం తెరిచి ఉండేదని, మిగతా రోజుల్లో మూసి ఉండేదని పెద్దలు చెబుతుంటారు. కాలక్రమేణా ఏయేటికాయేడు భక్తుల రాక అధికమవుతుండటంతో జాతర సమయంతో పాటు సాధారణ రోజుల్లోనూ ఆలయం రద్దీగా మారుతోంది. తిథుల ఆధారంగా బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో ఒక్కోయేటా వారాల సంఖ్య పెరగడం, తగ్గడం జరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఈసారి 12 వారాల పాటు జాతర సాగనుంది.

21-01-2024 మొదటి వారం (పట్నంవారం)
28-01-2024 రెండో వారం (లష్కర్‌వారం)
04-02-2024 మూడోవారం
11-02-2024 నాలుగోవారం
18-02-2024 ఐదోవారం
25-02-2024 ఆరోవారం
03-03-2024 ఏడోవారం
08-03-2024 మహాశివరాత్రి
10-03-2024 ఎనిమిదో వారం
17-03-2024 తొమ్మిదో వారం
24-03-2024 పదోవారం
31-03-2024 పదకొండోవారం
07-04-2024 పన్నెండోవారం
(అగ్నిగుండాలతో సమాప్తం)



కొమురవెల్లిలోని మల్లన్న దేవుడు

మూడు దిక్కులా పార్కింగ్ స్థలం ఏర్పాటు

కొమురవెల్లికి చేరుకునే మూడు మార్గాల్లో మల్లన్న చెరువు సమీప ప్రాంగణం, పెట్రోల్‌పంప్ ఎల్లమ్మ ఆలయం, ఆర్టీసీ బస్టాండు సమీపాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



పట్నంవారంతో పాటు జాతర మూడు నెలల కాలంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాం. త్వరితగతిన దర్శనం కలిగించడంతో, ప్రసాదం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. తాగునీటి వసతి కల్పించడంతో పాటు విద్యుత్ ఏర్పాట్లు చేపట్టాం. పారిశుద్ధ్య చర్యలు నిరంతరం నిర్వహించేలా సిబ్బందికి సూచనలు చేశాం. భక్తుల భద్రతకు పోలీసు అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నాం. రాజగోపుర ఆవరణలో కంట్రోల్‌రూం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

- బాలాజీశర్మ, ఆలయ ఈవో

మల్లన్నను దర్శించుకున్న సిద్దిపేట సీపీ అనురాధ

కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని సిద్దిపేట సీపీ అనురాధ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలకగా, సీపీ అనురాధ గర్భాలయంలో మల్లన్నకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయార్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. పట్నంవారం ఏర్పాట్లపై ఆలయాధికారులతో పాటు పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

‘శివసదనం’ వసతి భవనం ప్రారంభం

కొమురవెల్లి మల్లన్న భక్తుల సౌకర్యార్థం అన్నదానసత్ర భవనం ఎదురుగా నిర్మించిన 16 గదుల శివసదన భవనాన్ని శుక్రవారం పునరుద్ధరణ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. రూ.1.32 కోట్లతో రెండు అంతస్తుల్లో నిర్మించిన వసతి గదులను ఈనెల 7వ తేదీన జరిగిన మల్లన్న కల్యాణానికి హాజరైన మంత్రి కొండా సురేఖతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుని శిలాఫలకం ఏర్పాటు చేశారు. కానీ మంత్రి సురేఖ ప్రొటోకాల్ వాహన కాన్వాయ్ నిర్వహణ తప్పిదంతో నెలకొన్న పరిణామంతో వాయిదా వేశారు. దీంతో జాతరలో అందుబాటులోకి తీసుకువచ్చే పరిస్థితి లేక భక్తులు ఇబ్బందులుపడే పరిస్థితి నెలకొందన్న విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో ‘కొమురవెల్లిలో వసతిగదుల ప్రారంభంపై నిర్లక్ష్యం’ శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి పునరుద్ధరణ కమిటీ స్పందించింది. శుక్రవారం చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే మాజీ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిధులతో గతంలో మల్లన్న ఆలయ పరిధిలోని షాపింగ్‌కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటుతో పాటు హైదరాబాద్ భక్తుడు ఏర్పాటు చేసిన లిఫ్టును ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో బాలాజీశర్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.



శివసదన భవనాన్ని ప్రారంభిస్తున్న పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి

గుట్టుగా గుట్టలను తవ్వేస్తున్నారు

● మట్టి కోసం ప్రకృతి అందాలకు తూట్లు ● నర్సాపూర్ చుట్టూ యథేచ్ఛగా తవ్వకాలు

నర్సాపూర్, జనవరి 19: నర్సాపూర్ ప్రాంతంలో గుట్టలు, వాటిపై పరుచుకున్న పచ్చదనం ఎంతగానో ఆకట్టుకుంటుంది. అయితే స్వార్థపరుల చేతిలో నర్సాపూర్ చుట్టూ ఉన్న గుట్టలు ఉనికినే కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. హైదరాబాద్‌కు నర్సాపూర్ సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతం వ్యాపార, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ పలుకుతున్నది. మొన్నటి వరకు పొలాలుగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు పెద్దపెద్ద భవనాలతో దర్శనమిస్తున్నాయి. అయితే ఈ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన మట్టి కోసం నర్సాపూర్ చుట్టూ ఉన్న గుట్టలను తవ్వుతున్నారు. దీంతో గుట్టలు కరిగిపోతున్నాయి. పెద్దఎత్తున యంత్రాలతో తవ్వకాలు చేస్తుండటంతో ఇప్పటికే చాలా చోట్ల గుట్టల నుంచి మట్టి తీయడంతో చదునుగా మారుతున్నది. ప్రభుత్వ భూమిలో ఉన్న ఈ గుట్టలను మింగేస్తున్నారు. రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా, అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. నర్సాపూర్ సమీపంలో ఉన్న రాయరావు చెరువు చుట్టూ ఎత్తైన గుట్టలు ఉన్నాయి. ఈ గుట్టల నుంచి పెద్దఎత్తున యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంత యథేచ్ఛగా మట్టిని ఇష్టానుసారంగా ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నా ప్రభుత్వానికి మాత్రం ఒక్క రూపాయి రాకపోగా ప్రకృతిపరంగా ఏర్పడ్డ గుట్టలు ఉనికినే కోల్పోతున్నాయి. క్షేత్రస్థాయిలో సమాచారం ఇవ్వడానికి గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలు ఉండే వారు కానీ ఇప్పుడు ఆ వ్యవస్థ లేకపోవడంతో అక్రమాలు అధికారుల దృష్టికి సకాలంలో చేరడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమంగా మట్టి తవ్వకాలను నియంత్రించి ప్రకృతి అందాలను కాపాడుతూ పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



మట్టి కోసం నర్సాపూర్ పక్కన ఉన్న గుట్టను తవ్విన దృశ్యం

నీటిమడుగులో పడి..

వృద్ధురాలి మృతి

మిరుదొడ్డి, జనవరి 19 : దుస్తులను ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిమడుగులో పడి వృద్ధురాలి మృతిచెందిన సంఘటన శుక్రవారం మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామంలో చోటు చేసుకున్నది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన వెంకవ్వ(67) శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలోని పొలం వద్ద దుస్తులను ఉతకడానికి వెళ్లింది. వ్యవసాయ బోరుపంపు వద్ద ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు బోరు నీటి మడుగులో బోర్లపడి అక్కడికక్కడే మృతి చెందింది. దుస్తులు ఉతికేందుకు వెళ్లిన వెంకవ్వ తిరిగి ఇంటికి రాకపోవడంతో సాయంత్రం కుటుంబసభ్యులు వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉంది. మిరుదొడ్డి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న

గర్భిణికి సాధారణ ప్రసవం చేసిన వైద్యులు

● 27 వీడబ్ల్యూ బాటిల్స్ ఎక్కించి మరి ప్రసవం
● ఆడ శిశువుకు జన్మనిచ్చిన మహిళ
● వైద్య బృందాన్ని అభినందించిన నీలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి

మంగళ్‌హాట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ గర్భిణికి నిలోఫర్ ఆసుపత్రి వైద్యులు నార్మల్ డెలివరీ చేసి పండంటి బిడ్డకు ప్రాణం పోశారు. 27 బాటిళ్ల ఫాక్టర్స్ వచ్చి మారి తల్లి బిడ్డకు కొత్త జీవితం ప్రసాదించారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మగ్దంపల్లి గ్రామానికి చెందిన సేవంత బాయ్(31)కి 10 వేల మందిలో ఒకరికి ఉండే అరుదైన వ్యాధితో బాధపడుతుంది. రక్త స్రావం సమయంలో రక్తం గడ్డకట్టకపోవడంతో అదే పనికిగా రక్తస్రావం కావడం ఆమెకు ఉన్న వ్యాధి. వీడబ్ల్యూడీ - 3 రకం లోపంతో బాధపడుతున్నట్లు గతంలోనే నిమ్స్ వైద్యులు గుర్తించారు. ఇదిలా ఉండగా ఆమె గర్భం దాల్చగా ఐదు నెలలు నిండిన తరువాత నుంచి నిలోఫర్ వైద్యులను సంప్రదించి తనకున్న సమస్యను వివరించింది. దీంతో ఆసుపత్రి గైనకాలజీ వైద్యులు సదరు మహిళకు అప్పటి నుంచి పరీక్షలు నిర్వహిస్తూ అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా ఈ నెల 13వ తేదీన ప్రసవం నిమిత్తం వచ్చిన సదరు మహిళకు మరో మారు పరీక్షలు నిర్వహించి నార్మల్ డెలివరీ చేశారు. పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఇదిలా ఉండగా కాన్పు సమయంలో రక్తం శ్రావం కారణంగా ఆమెకు 27 బాటిళ్ల వీడబ్ల్యూ ఫ్యాటర్‌లను అందించారు. రూ. 1.50 లక్షల విలువైన ఈ ఫ్యాటర్లను ఉచితంగా అందించడంతో ప్రస్తుతం తల్లి బిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్న మహిళలకు నార్మల్ డెలివరీ చేసిన డాక్టర్ ఇంద్రమణి, డాక్టర్ సునిత, డాక్టర్ అనిత, డాక్టర్ సాధన, డాక్టర్ దామోదర్, డాక్టర్ భవతిలతో పాటు వైద్య సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి ప్రత్యేకంగా అభినందించారు.

కాంగ్రెస్ కోసం కష్టకాలంలో

పనిచేసిన వారిని గుర్తిస్తాం

● రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



మంత్రి పొన్నంతో ములుగు మండల నాయకులు

ములుగు, జనవరి 19 : కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపునిస్తామని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ములుగు మండల మాజీ ఎంపీపీ భర్త సుధాకర్ శుక్రవారం మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి తీరుతామన్నారు. ప్రతిపక్ష పార్టీలు నెల గడవకముందే హామీలు అమలు చేయాలని గగ్గోలు చేస్తున్నారని, కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పనిచేసినా రైతులకు రుణాలను మాఫీ చేయలేకపోయారన్నారు. అలాంటి వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వంద రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలకు ప్రభుత్వంలో, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వారితో మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కిసాన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ బొడ్డు బాలయ్య, ప్రవీణ్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, భుజంగారెడ్డి, ముత్యాలుగౌడ్, భద్రయ్య తదితరులున్నారు.

గౌరవెల్లి రిజర్వాయర్‌కు

సరిపడా నిధులు మంజూరు చేయండి

● వచ్చే వర్షాకాలం నాటికి రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టాలి
● రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చాడ వెంకట్‌రెడ్డి వినతి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జనవరి 19 : నిలిచిపోయిన శ్రీరాంసాగర్ వరద కాలువ గౌరవెల్లి రిజర్వాయర్‌తో పాటు కెనాల్స్ నిర్మాణ పనులకు సరిపడా నిధులు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. శ్రీరాంసాగర్ వరదకాలువలో భాగంగా గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి లిఫ్ట్ కెనాల్స్‌కు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2007లో శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం గౌరవెల్లి రిజర్వాయర్ పనులు 80శాతం వరకు పూర్తయ్యాయని, ముంపు బాధితులకు ఇంకా పరిహారం అందించకపోవడంతో పనులు నిలిచిపోయాయని వెల్లడించారు. అలాగే గండిపల్లి రిజర్వాయర్ పనులు కూడా 50శాతం మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. ఈ వేసవికాలంలో రిజర్వాయర్లను పూర్తి చేస్తే వర్షాకాలంలో నీటిని నింపే అవకాశం ఉంటుందన్నారు. గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల నుంచి కెనాల్స్ నిర్మాణం కొంత మేర జరిగాయని తెలిపారు. రిజర్వాయర్లు, కెనాల్స్ భూ సేకరణకు సరిపడా నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని చాడ కోరారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

● గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవోల సూచన

వెల్దుర్తి, జనవరి 19: గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, పశుసంవర్ధకశాఖ, ఐకేపీ, మిషన్‌భగీరథ, రోడ్డు భవనాల శాఖ, విద్యుత్ శాఖ అధికారులు 2024-25కు గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మంజూరు చేసే నిధులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యదర్శులతో కలిసి నివేదికను సిద్ధం చేసి ఈ నెల 27 వరకు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సూచించారు. సమావేశంలో ఎంపీవో విఘ్నేశ్వర్, ఏపీవో రాజు పాల్గొన్నారు.

కౌడిపల్లిలో

కౌడిపల్లి: గ్రామ పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది అంశాలకు సంబంధించిన లక్ష్యాలను సాధించేందుకు ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన 29 గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులతో శుక్రవారం ఎంపీడీవో కార్యలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. 2024-25 సంవత్సరానికి 50శాతం నిధులు, కేంద్ర నిధులు, పన్నుల రూపంలో వచ్చిన నిధులకు సంబంధించిన ప్రణాళికలను ఈ నెల 31 వరకు సిద్ధం చేయాలని సూచించారు. అధికారుల సమన్వయంతో పనిచేయలన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు 2030 వరకు నిర్దేశించిన ప్రతీ లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాల్సిన అవసరం కార్యదర్శులదే అన్నారు. ఉపాధి హామీ కింద నిర్వహించే పనుల్లో కనీసం 50 మంది కూలీలకు తక్కువకాకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఏపీవో షణ్ముదాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, పంచాయతీరాజ్ ఏఈ ప్రభాకర్, సీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ రమేష్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో

చిన్నశంకరంపేట: పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ సూచించారు. మండలంలోని గ్రామల అభివృద్ధికి ఎంపీటీసీ నిధుల మంజూరుపై శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. నిధులను గ్రామాల్లో ఎలా వినియోగించుకోవాలో వారికి అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీవో గిరిధర్‌రెడ్డి, పీఆర్ఏఈ విజయ్, వైద్యాధికారి సాయిసింధు, ఏపీఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్

చేగుంటలో

చేగుంట: చేగుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో నాగభూషణం ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ శాఖల గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై ప్రణాళికల గురించి చర్చించారు. గత ఆర్థిక సంవత్సరం చేసిన ఖర్చులను, వచ్చే ఆర్థిక సంవత్సరం ఖర్చు ప్రణాళికలపై అధికారులను అడిగి తెలుసుకుని, నివేదికను రూపొందించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు శ్రీనివాస్, చల్లా లక్ష్మణ్, రేణు, పద్మ, సుగుణ, స్వర్ణలత, శ్రీవాణి, జ్యోతి, శేఖవ్వ, విజయ పాల్గొన్నారు.





కౌడిపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్, వెల్దుర్తిలో హాజరైన పంచాయతీ కార్యదర్శులు

గురుకులాల్లో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి: కేవీపీఎస్



సంగారెడ్డిలో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 19: సంక్షేమ గురుకులాల్లో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామానికి చెందిన విద్యార్థిని బేగరి స్వప్న రంజోల్ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతూ కళాశాలలోనే ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. రంజోల్ గ్రామానికి చెందిన ప్రియదర్శిని అందోల్ గురుకులంలో భవనం నుంచి పడి మృతి చెందిందన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల మరణాలను అరికట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇందిరమ్మ ఇళ్లు, మూడెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఎస్ఎస్టీ జిల్లా అధ్యక్షుడు రవి, విద్యార్థుల కుటుంబ సభ్యులు ఉన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

● రూ.62,500, రెండు కార్లు స్వాధీనం

సంగారెడ్డి క్రైం/పుల్కల్, జనవరి 19: పుల్కల్ మండలం హన్మాపురం శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట స్థావరంపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.62,500 నగదు, రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

చిన్నశంకరంపేట, జనవరి 19: చిన్నశంకరంపేట మండలంలోని కోర్వేపల్లి పాఠశాలలో వారం రోజుల కిత్రం చోరీకి పాల్పడిన నిందితుడిని శుక్రవారం రిమాండ్ తరలించారు. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం కడమంచి సుదర్శన్ పాఠశాల గది తాళాన్ని పగులగొట్టి కేబుల్ వైర్లను దొంగలించాడు. పాఠశాల హెచ్‌ఎం హిమబిందు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో దొంగలించిన వైర్లను సుదర్శన్ బైక్‌పై తీసుకెళ్తు పట్టుబడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

లెక్చరర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

మెదక్ అర్బన్, జనవరి 19: తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ మెదక్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీజీఎల్ఏ జిల్లా అధ్యక్షుడిగా ఉస్మాన్, ప్రధాన కార్యదర్శిగా వేణుమాధవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింహులు, ఉపాధ్యక్షులుగా ఫసి మొహియుద్దీన్, పెనిల్, మహిళా కార్యదర్శిగా అనిత, కార్యానిర్వాహక కార్యదర్శిగా అజీమ్, సభ్యులుగా అశోక్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నారు.

టీపీజేఎం ఉమ్మడి మెదక్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు దుర్గేశ్వర్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 19: తెలంగాణ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక సిద్ధార్థ స్కూల్‌లో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు ప్రభాకర్ గౌడ్, మహిపాల్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా దుర్గేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారెడ్డి, కోశాధికారిగా కెయం.శర్మ, గౌరవ అధ్యక్షులుగా సత్యనారాయణ, సభ్యులుగా శ్రీనివాస్‌చౌదరి, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ఎస్టీయూ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడిగా శివప్రసాద్



చిన్నశంకరంపేట, జనవరి 19: ఎస్టీయూ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడిగా సూరారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రాద్ శుక్రవారం ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించినట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పోచయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్డి సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

కల్హేర్, జనవరి 19: మండల పరిధిలోని మార్డి గ్రామ సర్పంచ్ విజి లక్ష్మీనారాయణ చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలతో సస్పెండ్‌కు గురైన లక్ష్మీనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. అధికారులు విచారణ జరుపగా నిధులు దుర్వినియోగం కాలేదని నివేదిక ఇవ్వడంతో హైకోర్టు సర్పంచ్ సస్పెన్షన్‌ను రద్దు చేసింది. ఈ మేరకు చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ, ఎనిమిదవ వార్డు సభ్యురాలు బొమ్మల బాలమణికి జాయింట్ చెక్ పవర్ కల్పిస్తూ డీపీవో సురేష్‌మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.

టీపీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

● జిల్లా అధ్యక్షుడు నాగారం

కల్హేర్/సిర్గాపూర్, జనవరి 19: ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మం పట్టణంలో జరిగే తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ కోరారు. సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్, కేజీబీవీ, మండల పరిధిలోని కడ్పల్ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం మహాసభల పోస్టర్‌లను ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఐదు సంవత్సరాలకోసారి జరిగే మహాసభలు ఈసారి కనుల పండువగా నిర్వహిస్తామన్నారు. మహాసభలకు సంగారెడ్డి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని నాగారం శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహేశ్వరరావ్, సిర్గాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ.రహీం, తావుర్యా నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.9.20 లక్షల చెక్కు అందజేత

నారాయణఖేడ్: పలుగుతండాకు చెందిన వడిత్యా రజని(26) ఏడాదిన్నర క్రితం సికింద్రాబాద్‌లో రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందింది. ఆమె కుటుంబానికి పరిహారం ఇవ్వాలని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ రైల్వే శాఖకు సిఫార్సు చేశారు. ఈ మేరకు రైల్వే శాఖ రూ.9.20 లక్షలు మంజూరు చేయగా మాజీ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఆ చెక్కును హైదరాబాద్‌లో మృతురాలి భర్త విష్ణుకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్, సీతారాంతండా సర్పంచ్ రాజునాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నారాయణఖేడ్: పట్టణంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమత్తుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖేడ్‌పట్టణంతో పాటు డివిజన్ పరిధిలోని మండలాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

శివ్వంపేట: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను నర్సాపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు సంధ్యారాణి తనిఖీ చేశారు. ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరపాలని, రికార్డులు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. రైతులు ఆధార్ కార్డును అందజేసి ఎరువులను కొనుగోలు చేయాలని కోరారు. ఆమెవెంట మండల వ్యవసాయ అధికారి లావణ్య ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సంగారెడ్డి క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురిని కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

'పోక్సో'పై అవగాహన కలిగి ఉండాలి

చిన్నశంకరంపేట, జనవరి 19: నేషనల్ గర్ల్స్ చైల్డ్ డే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు పోక్సోపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా ఎన్‌జీసీడీ కో ఆర్డినేటర్ సంతోషి అవగాహన కల్పించారు. పోక్సోపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలబాలికలను లైంగిక వేధింపుల నుంచి రక్షించడానికి ఏర్పాటు చేసిన పోక్సో అమలులోకి వచ్చి పది సంవత్సరాలు గడిచిపోతున్నా ఇంకా సరైన అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులు ఆనందకరమైన బాల్యాన్ని పొందడం వారి హక్కు అని వివరించారు. మహిళలు ఆపదలో ఉన్న సమయంలో వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో భరోసా జిల్లా ఆర్గనైజర్ సౌందర్య, ప్రిన్సిపాల్ నాగేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిల్వ ఉంచిన 33 సిలిండర్ల పట్టివేత

నారాయణఖేడ్, జనవరి 19: అక్రమంగా నిల్వ ఉంచిన 33 గ్యాస్‌సిలిండర్లను పోలీసులు సీజ్ చేశారు. ఖేడ్ పట్టణానికి చెందిన షేక్ ఇఫ్తికార్, మహ్మద్ షబ్బీర్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచి, అధిక ధరలకు అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేసి, 33 గ్యాస్‌సిలిండర్లను సీజ్ చేశామని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామన్నారు. అక్రమంగా సిలిండర్లను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టి టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

మనోహరాబాద్, జనవరి 19: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండంగా కూచారం శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన

చేగుంట, జనవరి 19: నేషన్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సహకారంతో మెదక్ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డానియల్ ఆధ్వర్యంలో శుక్రవారం చేగుంట బస్టాండ్ ఆవరణలో హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై కనకదుర్గ కళాజాత బృందం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు భుజంగం మురళి, ఓంకారం, కృష్ణవిధిమౌళి, లక్ష్మీశాంతి, మెదక్ స్కోప్ స్వచ్ఛంద సంస్థ పీడీ ఉప్పలయ్య, డీఆర్‌పీ నగేష్, సూపర్‌వైజర్ అమరేందర్, సీఎల్‌డబ్ల్యూ రేవతి, ఓఆర్‌డబ్ల్యు రజిత పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలతో ఆర్థికాభివృద్ధి

రేగోడు జనవరి 19: డ్వాక్రా సంఘాల మహిళలు శ్రీనిధి రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని శ్రీనిధి ఆర్ఎం గంగారం అన్నారు. శుక్రవారం రేగోడు సెర్ప్ కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. మహిళలకు అందిస్తున్న బ్యాంకు లింకేజీల లోన్, శ్రీనిధి రుణాలు, గ్రామ సంఘాల పనితీరుపై చర్చించారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు తులసి, ఏపీఎం సంగీత, శ్రీనిధి ఏఎం పరమేశ్వరి, సీసీలు రాములు, కిష్టయ్య, అనసూయ పాల్గొన్నారు.

లింగ బలిజ సంఘం కమిటీ ఎన్నిక

సంగారెడ్డి రూరల్, జనవరి 19: వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా నూతన కమిటీని శుక్రవారం జిల్లా అధ్యక్షుడు తుమ్మల పృథ్వీరాజ్ ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాణాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్ పటేల్, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్, స్వామి, చరణ్‌ప్రసాద్, పట్నం శెట్టి మల్లేశం, యూత్ అధ్యక్షుడిగా సతీష్, మహిళా అధ్యక్షురాలిగా సంగీత, ఉపాధ్యక్షురాలిగా వీరమణి, ప్రధాన కార్యదర్శిగా వినీత, సింగిశెట్టి గొలీశ్వర్, అమర్నాథ్, ప్రభు లింగం, అశోక్, యాదన్న, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

బీజేపీ మత రాజకీయాలను తిప్పికొట్టాలి

● ఫిబ్రవరి 16న గ్రామీణ, పారిశ్రామిక బంద్

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

సంగారెడ్డి రూరల్, జనవరి 19: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మత రాజకీయాలను అందరూ కలిసికట్టుగా తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వత్తాసు పలుకుతున్నదని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మత రాజకీయాలకు తెరలేపుతున్నదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి పేదవాడి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి పది సంవత్సరాలైనా అతీగతీ లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా నల్ల చట్టాలను తీసుకువస్తే సంవత్సరం పాటు పోరాటం చేసి మోదీ మెడలు వంచిన చరిత్ర రైతాంగానిదని చెప్పారు. వ్యవసాయ కార్మికులను ఆదుకోవడానికి వామపక్షాల సహకారంతో గత ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువస్తే బీజేపీ ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. బీజేపీ అనుసరిస్తున్న మత రాజకీయాలను తిప్పికొట్టేందుకు దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు సంయుక్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్‌కు పిలునిచ్చినట్లు వెల్లడించారు. 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అన్ని యూనియన్ల కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని మల్లికార్జున్ కోరారు. సెమినార్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, యాదవరెడ్డి, వ్యకాస జిల్లా కార్యదర్శి నర్సింహులు, నాయకులు యాదగిరి, పాండురంగారెడ్డి, ప్రసన్నరావు, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, నరసింహారెడ్డి, లక్ష్మీ, అనురాధ, శ్రీనివాస్‌రెడ్డి, తిరపతి, చంద్రయ్య, విఠల్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేకే భవన్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

డంపింగ్‌యార్డు పనులను అడ్డుకున్న గ్రామస్థులు

హత్నూర, జనవరి 19: మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామ శివారులో సంగారెడ్డి మున్సిపాలిటీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సంగారెడ్డి మున్సిపాలిటీ టీపీవో చంద్రశేఖర్, శానిటరీ ఆఫీసర్ విజయబాబు తమ సిబ్బందితో గుండ్ల మాచునూర్ గ్రామ శివారులో డంపింగ్‌యార్డు ఏర్పాటు కోసం పనులు చేపడుతుండగా విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకొని పనులను అడ్డుకుని, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కంకర క్రషర్, పరిశ్రమల కాలుష్యంతో తాము గ్రామంలో ఉండలేని పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. అంతేకాకుండా సంగారెడ్డి, కంది, హత్నూర మండలాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు చదివే మోడల్ స్కూల్‌కు అతి సమీపంలో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించుకోవడం అధికారుల అనాలోచిత నిర్ణయానికి నిదర్శనమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు డంపింగ్‌యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పనులను అడ్డుకున్న వారిలో గ్రామ సర్పంచ్ జయంతిశశిధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ వార్డు సభ్యులు కృష్ణ, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మన్నే ప్రభాకర్, యాదయ్య, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్‌లో అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్థులు


ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన

జిన్నారం, జనవరి 19: పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై మహిళలు ముగ్గులతో వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా గడ్డపోతారం పారిశ్రామిక వాడలో వివిధ పరిశ్రమలలో తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ జయప్రకాష్‌ల ఆధ్వర్యంలో ఓటు హక్కు, ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పరిశ్రమ కార్మికులు ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కుతోనే ప్రజాసేవ చేసే మంచి నాయకుడ్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

చౌటకూర్‌లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై అవగాహన

పుల్‌కల్, జనవరి 19: చౌటకూర్ మండల కేంద్రంలో శుక్రవారం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. స్థానిక రైతు వేదికలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఏరువాక కేంద్రం సమన్వయకర్త కే.రాహుల్‌విశ్వకర్మ హాజరై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో కలిగే ప్రయోజనలను వివరించారు. పంటను ఆశించే వివిధ రకాల చీడపీడల నిర్మూలనకు తీసుకోవల్సిన జాగ్రత్తను వివరించారు. వివిధ రకాల పత్తి వంగడాలపై వాటి ఉత్పాదక పత్తి బరువు, మొక్కల లక్షణాలపై సంగుపేట ఏరువాక కేంద్రం అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్కూరి వీరమణిమొగులయ్య, జోగిపేట ఏడీఏ అరుణ, ఏవో చైతన్య, ఏఈవో ప్రవీణ్, జే.రాజశేఖర్, శ్రీకాంత్, రైతులు మాణిక్యరెడ్డి, గొంగ్లూరు జనార్దన్ ముదిరాజ్, గౌని కిరణ్, మధుసూధన్‌గౌడ్, గొంగ్లూరు విద్రుడు తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించిన కలెక్టర్



డైరీని ఆవిష్కరిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 19: రాష్ట్ర వ్యవసాయాధికారుల సంఘం రూపొందించిన డైరీ, క్యాలెండర్‌లను శుక్రవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ క్రాంతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ నర్సింహారావు, వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైద్యనాథ్, శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ సురేష్‌బాబు, రామకృష్ణారెడ్డి, ప్రసాద్, ప్రేమలత, అంజలి, రమేష్, శ్రీకాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మెదక్ అర్బన్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ మెదక్ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు రమేష్, వేంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● శివ్వంపేట: ఎస్‌జీటీయూ క్యాలెండర్‌ను ఎంఈవో బుచ్యానాయక్ శుక్రవారం శివ్వంపేటలోని ఎమ్మార్సీ భవనం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో సురేందర్, ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, ఉపాధ్యక్షుడు సత్తయ్య, మండలాధ్యక్షుడు సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

● జహీరాబాద్ ఎంవీఐ జయప్రకాష్‌రెడ్డి

జహీరాబాద్, జనవరి 19: వాహనదారులందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జహీరాబాద్ ఎంవీఐ జయప్రకాష్‌రెడ్డి సూచించారు. రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని మహీంద్రా కర్మాగారం వద్ద కార్మికులకు, డ్రైవర్లకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంవీఐ మాట్లాడుతూ.. వాహనాలను నడిపే సమయంలో కొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రదీప్‌గౌడ్, విశ్వనాథ్, కానిస్టేబుల్ ముత్యాలు, హోంగార్డు గంగారాం పాల్గొన్నారు.



మహీంద్రా కర్మాగారం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్న ఎంవీఐ జయప్రకాష్‌రెడ్డి

సమయపాలన పాటించని తహసీల్ అధికారులు, సిబ్బంది

మనోహరాబాద్, జనవరి 19: మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. శుక్రవారం ఉదయం 10.30 గంటలైనా కార్యాలయానికి అధికారులెవ్వరూ రాలేదు. కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా మధ్యాహ్న సమయంలో కార్యాలయానికి వస్తున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది.



ఉదయం 10.30 గంటలైనా అధికారులు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు